# హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ చరిత్ర సృష్టించాలి

- కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధిలో అగ్రభాగాన తెలంగాణ
- అన్ని రంగాల్లో 'ఉప్పల్' అభివృద్ధికి కృషి
- బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలించాలి
- ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి
- మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం.. భారీగా హాజరైన గులాబీ దండు



మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, చిత్రంలో పార్టీ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

కాప్రా/ ఉప్పల్/ మల్లాపూర్, అక్టోబర్ 26 :
దేశంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణను తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పిలుపు ఇచ్చారు. గురువారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా బండారి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో అగ్రభాగాన నిలిచిందని అన్నారు. తనకు టిక్కెట్ వచ్చాక ఉప్పల్‌కు వంద పడకల హాస్పిటల్‌ను, పలు కాలనీలను నివాస జోన్లుగా మార్పిడి చేయిస్తూ జీఓ జారీ అయ్యేలా కృషి చేశానన్నారు. నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి జరిగేలా చిత్తశుద్ధితో కృషిచేస్తానని, విద్యార్థుల భవిష్యత్‌కోసం, జూనియర్, డిగ్రీ కళాశాలలను మంజూరు చేయిస్తానని అన్నారు. తమ బీఎల్ఆర్ ట్రస్టుద్వారా ఎంతో మందికి విద్య, వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేశానని, సేవా కార్యక్రమాలతో పాటు ఉప్పల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఉప్పల్‌లో బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించేలా ప్రజలు తీర్పు ఇస్తారని బీఎల్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్, బీజేపీల ఫేక్ హామీలను తిప్పికొట్టాలి

అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపుకై అనుసరించాల్సిన విధి విధానాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉప్పల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి వివరిస్తూ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీకి కార్యకర్తలే బలం అని, అందరిని కలుపుకుపోతూ పార్టీ సైన్యాన్ని పెంచుకుంటూ ప్రచారం చేయాలని అన్నారు. సోషల్ మీడియా వేదికగా మ్యానిఫెస్టోను సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ఇంటింటికి తిరిగి వివరిస్తూ, కాంగ్రెస్, బీజేపీల ఫేక్ హామీలను, విషప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని గులాబీదండుకు సూచించారు.

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పాలన దేశంలోని అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఉప్పల్‌లో భారీ మెజారిటీతో బండారి గెలువడం తథ్యమని అన్నారు. అనంతరం రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని, కేటీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ మోడ్రన్ సిటీగా , ఐటీహబ్‌గా మారిందని కొనియాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని, బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యకర్తల్లో జోష్....

సమావేశం మధ్యమధ్యలో గులాబీల జెండా పాటను వినిపిస్తూ నాయకులు, మహిళా కార్యకర్తల్లో జోష్ నింపారు. సభకు భారీగా హాజరైన కార్యకర్తలు ఉత్సాహంగా స్పందిస్తూ ప్రసంగాలకు కరతాళ ధ్వనులతో బిగ్గరగా నినాదాలు చేశారు. సమావేశం అయ్యాక ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, నాయకులను, మహిళా నాయకులను కలిసి వారితో ముచ్చటిస్తూ కలివిడిగా తిరిగారు. కార్యకర్తలు వారితో కరచాలనాలు చేస్తూ ఫొటోలు దిగారు.






సమావేశానికి హాజరైన నాయకులు, మహిళా నాయకులతో ముచ్చటిస్తున్న అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

## కాంగ్రెస్ అభ్యర్థి చిల్లర రాజకీయాలు మానుకోవాలి

దుండిగల్,అక్టోబర్26: కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కొలన్ హన్మంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని సూరారం డివిజన్ వార్డు కమిటీ సభ్యురాలు,బీఆర్ఎస్ పార్టీ మహిళానాయకులు షెహనాజ్ బేగం అన్నారు.ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హన్మంతరెడ్డి బుదవారం తన ఇంటికి వచ్చిన మాట వాస్తవే అన్నారు. దసరా పండుగనేపథ్యంలో శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చాడని భావించి,పెద్ద మనిషి కదా అని ఫొటోలు దిగానన్నారు. అయితే సదరు నాయకుడు చిల్లరగా వ్యవహరించి తాను కాంగ్రెస్‌పార్టీలో చేరినట్లు వాట్సాప్‌గ్రూపులల్లో ఫొటోలు వైరల్ చేయడంతో పాటు మీడియాకు ప్రకటనలు ఇవ్వడం ఎంతవరకు కరెక్టని ప్రశ్నించారు. తనను కాంగ్రెస్ పార్టీలో చేరమని కోరుతూ బలవంతంగా పార్టీ కండువాను తన మెడలో కప్పారన్నారు. అందుకు తాను తిరస్కరించానని స్పష్టం చేశారు.ఆసమయంలో తీసిన ఫొటోలను వైరల్ చేస్తూ తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రచారం చేయడం దిగజారుడు తనం కాక మరేమిటన్నారు. అయినా తాను ఎందుకు బీఆర్ఎస్‌ను వీడాలని ఆమె ఎదురు ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ నేతృత్వంలో గడిచిన తొమ్మిది ఏండ్లుగా నియోజకవర్గం సమగ్రాభివృద్ధిలో పయనిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజారంజక పాలన అందజేస్తూ అభివృద్ధి, సంక్షేమపథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ముందంజల్లో ఉన్నదని పేర్కొన్న ఆమె రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా నేతలు అరుణ, లావణ్య, భాగ్యలక్ష్మి, సరస్వతి, ధనలక్ష్మి, హర్ష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకురాలు షెహనాజ్ బేగం

## బండారి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..



బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సాయిజెన్‌శేఖర్

రామంతాపూర్, అక్టోబర్ 26 : ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్ కోరారు. ఈ మేరకు గురువారం నాచారం డివిజన్ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని 48 బూత్‌లకుగాను ఒక్కొక్క బూత్‌లో 12 నుండి 15మందిని ఏర్పాటు చేసుకోవాలని కార్యకర్తలకు , నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే గా బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడల మల్లికార్జున్‌గౌడ్ ,మేకల ముత్యంరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## తనయుడి కోసం తండ్రి ప్రచారం..



మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి గెలుపు కోసం అతని తండ్రి మర్రి లక్ష్మణ్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మౌలాలి డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అరుంధతి దవాఖానలో ఉచిత చికిత్సలు అందజేస్తున్నామని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ సైయ్యద్, మహ్మద్ సాదిక్, మహ్మద్ మూసా, కేవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. *– మల్కాజిగిరి, అక్టోబర్ 26*

## పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే



క్రీడాకారుల సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్

నేరేడ్‌మెట్, అక్టోబర్ 26: పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని మాస్టర్ సంతోష్ కుమార్ అన్నారు. గురువారం నేరేడ్‌మెట్‌లో తెలంగాణ రాష్ట్ర టైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.హరి గౌడ్ ఏర్పాటు చేసిన క్రీడా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఓటమి గెలుపునకు పునాదిలాంటిదని, గెలుపొందడానికి ప్రతి క్రీడాకారుడు శ్రమించాలన్నారు.

## బహుళ అంతస్తుపై నుంచి పడి కార్మికుడు మృతి

కుత్బుల్లాపూర్,అక్టోబర్26: ప్రమాదవశాత్తు ఓ బహుళ అంతస్తు నిర్మాణంపై పనులు చేస్తుండా కిందపడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఒడిశారాష్ట్రానికి చెందిన తులసీవాస్(45) తన కుటుంబ సభ్యులతో కలిసి గుండ్లపోచంపల్లిలో ఉంటూ దినచర్య సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తూ తన కుటుంబాన్ని పోశించుకుంటున్నాడు. కాగా రోజువారి పనిలో భాగంగా గుండ్లపోచంపల్లిలోని బుధవారం ఓ బహుల అంతస్తు నిర్మాణంలో నాల్గవ అంతస్తుపైకి ఎక్కి స్లాబ్ సెంట్రింగ్ పనిలో నిమగ్నమయ్యాడు. పని చేస్తున్న క్రమంలో కాలు జారి కిందపడడంతో తీవ్రగాయాలపాయ్యాడు. తోటి కార్మికులు హుటాహుటిన కొంపల్లిలోని ప్రైయివేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.